## పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

**మేడ్చల్, మే 11 :** పాలీసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరుంధతి తెలిపారు. ఈనెల 13వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం1.30 గంట ల వరకు పరీక్ష జరుగుతుంద న్నారు. మేడ్చల్లో 8 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, స్ఫూర్తి జూనియర్ కళాశాల, ఎన్ఎస్ఆర్ జూనియర్‌కళాశాల, హైటెక్ మోడ్రన్ స్కూల్, హైటెక్ మోడల్ స్కూల్, ఆక్స్ఫర్డ్ హైస్కూల్, ఎస్ ఎస్పీ హైస్కూల్, ఢిల్లీ వరల్డ్ స్కూల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికివిద్యార్థులను ఒక గంటల ముందుగానే అనుమతిస్తామని, ఓఎంఆర్ షీట్ని రెండు వైపులా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు హెచ్బీ పెన్సిల్, ఎరైజర్, బ్లూ లేదా బ్లాక్‌పెన్ వెంటతెచ్చుకోవాలన్నారు. హాల్ టికెట్‌పై ఫొటో ప్రింట్ కాక పోతే పాస్‌ఫొటో,ఆదార్ కార్డు తీసుకురావాలని ఆమె సూచించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**కాప్రా, మే 11:** ఈసీఐఎల్ కమలానగర్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆదివారం సీపీఐ ఉప్పల్ మండలం 4వ మహా సభల సందర్భంగా సీపీఐ ఉప్పల్ మండలానికి నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. సీపీఐ ఉప్పల్ మండల నూతన కార్యదర్శిగా టీ. సత్య ప్రసాద్, సహాయ కార్యదర్శి గా ఎం.డీ. బషీర్‌తో పాటు 35 మంది కౌన్సిల్ సభ్యులు, 17 మంది సహాయ కార్య వర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా సత్య ప్రసాద్, బషీర్ మాట్లాడుతూ మండలం లో సీపీఐని బలోపేతం చేసేందుకు నూతన కార్య వర్గం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు .

## మహిళ మృతదేహం లభ్యం

**శామీర్‌పేట్, మే 11:** శామీర్‌పేట్ చెరువులో ఆదివారం ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం ..రసూల్‌పురకు చెందిన కాయితపురం సుశీల( 60), కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. శనివారం పనికి వెళ్తున్నానని బయటకు వెళ్లిన ఆమె మృతదేహం ఆదివారం శామీర్‌పేట్ చెరువులో కనిపించింది. మృతురాలి కొడుకు రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**మైలార్‌దేవ్‌పల్లి, మే 11:** చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..ఈనెల 9న దుర్గానగర్ చౌరస్తాలో అశోక్ లేలాండ్ వాహనంరోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 30–35 ఏండ్ల మధ్య ఉంటుం దన్నారు. మృతుడి ఆచూకీ కోసం స్థానికంగా వాకాబు చేసినా ఎలా ంటి సమాచారం అందలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# హిమపురికాలనీ పార్కు స్థలాన్ని పరిరక్షిస్తా..



హిమపురి కాలనీలోని పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీవాసులు



హిమపురి కాలనీలో నిర్వహించిన మాతృ దినోత్సవ వేడుకల్లో పాల్గొని పలువురు మాతృమూర్తులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 11: హిమపురి కాలనీలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. మన సురాబాద్ డివిజన్ హిమపురి కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సదరు కాలనీలో పర్యటించారు. కాలనీలోని ప్రధానమైన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురైందని.. సదరు స్థలం కబ్జాకు గురికావడం వెనుక ఓ ప్రజాప్రతినిధి హస్తము ఉందని ఎమ్మెల్యేకు ప్రజలు వివరించారు. పార్కు స్థలం విషయంపై ఇప్పటికే జిహెచ్ఎంసి అధికారులకు, హైడ్రాకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఎమ్మెల్యేకు తెలిపారు. కోట్లాది రూపాయల పార్కు స్థలాన్ని పరిరక్షించి కాలనీవాసులకు న్యాయం చేయాలని హిమపురి కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎవరు భయాందోళనకు గురి కావద్దని పార్కు కబ్జా విషయాన్ని త్వరలో జిహెచ్ఎంసి కమిషనర్ తో పాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితిలోనూ పార్కు స్థలాన్ని కాపాడతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కడి రఘువీర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, గోపికృష్ణారెడ్డి, బద్రీనాథ్, రవి కిరణ్, సత్యనారాయణ రెడ్డి, దత్తం రెడ్డి, యాద సంతోష్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**హిమపురి కాలనీలో ఘనంగా మాతృ దినోత్సవం**

మాతృ దినోత్సవ వేడుకలను మనుషుల డివిజన్ పరిధి హిమపురికాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పలువురు మాతృమూర్తులను ఘనంగా ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జగదీశ్ యాదవ్, నాగరాజు, రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్‌కి మద్దతు తెలుపుతున్న సామాజిక కార్యకర్త దోసపాటి రాము తదితరులు

## ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా ర్యాలీ

మన్సురాబాద్, మే 11: ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా సామాజిక కార్యకర్త దోసపాటి రాము ఆధ్వర్యంలో ఆదివారం నాగోల్ డివిజన్ పరిధి రాక్ హిల్స్ కాలనీలోనీ రైస్ ఏటీఎం వద్ద సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దోసపాటి రాము మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరు జరుపుతున్న భారత సైనికులకు ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

కందుకూరు, మే 11: యువకులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కందపెద్ద నరసింహ, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ మాజీ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్ తెలిపారు. దాసర్లపల్లి గ్రామంలో డీడీపీఎస్, ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించారు. ప్రవీణ్, బాలకృష్ణ, జట్లు చివర్లో పోటాపోటీగా తలపడ్డాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులతోపాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. యువకులు పంతాలు పట్టింపులకు పోకుండా కలిసిమెలసి ఉండాలని కోరారు. క్రీడల్లో గెలిచిన విజేతలకు పలువురు రాజు, నరసింహులు నగదుతోపాటు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో యువకులు నిర్వాహకులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కందపెద్ద నరసింహ, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ మాజీ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్

## జాటోతు ఠాను నాయక్ పోరాటం మరువలేనిది..

ఠాను విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి



చందన చెరువు కట్టపై జాటోతు ఠాను నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, మే 11: లంబాడీల కోదమ సింహం జాటోతు ఠాను నాయక్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి హాజరై ఆవిష్కరించారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చందన చెరువుకట్టపై విగ్రహం ఏర్పాటు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో విస్తృతంగా పోరాడిన ధైర్యవంతుడు విసునూరు దేశముఖ్ గుండాలను గడగడ లాడించిన ధీరశాలి అన్నారు. దొర ఆగడాలను, నిజాం సర్కార్ నిరంకుశ పాలనను ధైర్యంగా ఎదిరించిన ఘనుడు అన్నారు. తెలంగాణ పోరుగడ్డపై లంబాడీ జాతికే వన్నె తెచ్చిన మహాపోరాట యోధుడు అన్నారు. అమరుడిగా లంబాడీ సమాజానికి ఆదర్శంగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు అనిల్‌కుమార్ యాదవ్, భూపాల్ రెడ్డి, దిప్లా నాయక్, బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్ రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, నర్సిరెడ్డి, శీను నాయక్, మాధవి, జిల్లాల్పూర్ సునీత బాలరాజ్, పల్లె జంగయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు..**



మాతృ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం నియోజకవర్గంలోని చందన చెరువు సమీపంలో మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కేక్‌కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి బీఆర్ఎస్ మహిళా నాయకురాలు, నాయకులు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తల్లి అనేది ప్రతి మనిషి జీవితంలో వెలకట్టలేని పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు విజయలక్ష్మి, లలిత జగన్, నిర్మల రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, దీప్లాల్, జలాల్పూర్ సునీత బాలరాజ్, నాయకులు తదితరులు ఉన్నారు.

## క్రీడలను ఆకర్షించేందుకే విద్యార్థులకు శిక్షణా శిబిరాలు

కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, మధుసూదన్ రెడ్డి



కృష్ణ తులసినగర్‌లోని కమ్యూనిటీ హాల్లో జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ విభాగం అందించిన క్రీడా పరికరాలను యువతకు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి

మలక్ పేట మే 11: యువతను, పిల్లలను క్రీడల పట్ల ఆకర్షితులను చేసేందుకు, క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ వేసవిలో క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుందని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ వింగ్ ద్వారా రూ.2 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ కిట్లను ఆదివారం ఆమె కృష్ణ తులసీనగర్‌లోని కమ్యూనిటీ హాల్లో యువతకు, క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో యువత, క్రీడాకారులు విద్యార్థులు, టీవీలకు సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోకుండా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో యువకులు రంజిత్, సంతోష్, సన్నీ, జస్వంత్, శ్రవణ్, రిషి, ప్రశాంత్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

కందుకూరు, మే 11: మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం ఊట్లపల్లిలో దేవునిగుట్టపై గల లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు మాజీ సర్పంచ్ తేరేటి లలిత లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చండీ ఉపాసకులు రేవల్లె రాజు శర్మ సమక్షంలో పండితులు ఆదివారం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య, అఖండ దీపారాధన ధ్వజారోహణం మండప పూజలు అగ్ని ప్రతిష్ట, అంకురార్పణం, హోమాలు యజ్ఞాలు హారతి మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 12వ తేదీ సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అభిషేకాలు, పూజలు, హోమాలు, సుదర్శన హోమం, ఆంజనేయ హోమం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం దేవునిగుట్టపై ఉన్న పరమ పవిత్రమైన లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులతోపాటు మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేవీఎన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కృష్ణా నాయక్, పీఏపీసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్ హాజరవుతున్నట్లు చెప్పారు.

## దేవాలయాలను శాస్త్రబద్ధంగా అభివృద్ధి చేయాలి

కందుకూరు, మే 11: శాస్త్రబద్ధంగా దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాలని పురావస్తు పరిశీలకులు శివ నాగిరెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని లేమూరులో గల శ్రీదేవి, భూదేవి, సహిత వెంకటేశ్వరస్వామి మాన్యం భావి దేవాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగమ శిల్ప ప్రకారం తీర్చిదిద్దడానికి అవసరమైన సూచనలను దేవాలయ నిర్వాహకులకు సూచించారు. దేవాలయాలను వాస్తు ప్రకారం నిర్మించాలని కోరారు. ఆలయ రూపురేఖలను మార్చడానికి కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, ఢిల్లీ గణేశ్ ముదిరాజ్ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ భూపాల్ రెడ్డి, ఢిల్లీ బాలకృష్ణ, రాయి చెట్టు ఆయిల్ పాల్గొన్నారు.

# మాతృమూర్తులు దైవ సమానులు:ఎమ్మెల్యే



మచ్చ బొల్లారంలో మదర్స్ డే సందర్భంగా తల్లులకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి మే 11:** మాతృమూర్తులు దైవసమానులని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మాతృ మచ్చ బొల్లారం డివిజన్ హనుమాన్ టేకిడి వద్ద మాతృ దినోత్సవ సందర్భంగా శంకర శశాంక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాతృ దినోత్సవ కార్యక్రమంలో శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి , చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తల్లి లేనిది మనం లేమని తన తల్లి కోరిక మేరకు ఉచితంగా అరుంధతి హాస్పిటల్ ను నడుపుతున్నానన్నారు. అందరికీ ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రజిని , డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య, బీఆర్ఎస్ నాయకులు రమేష్, పవన్, మల్లికార్జున్, బీ.ఎస్ శ్రీనివాస్ రావు, స్వరూప రాణి,మధుసూదన్, బాలరాజు, సురేష్ ,శివ శంకర్, దేవేందర్, అరుణ్ పాల్గొన్నారు.



నరసింహస్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

**నేరేడ్‌మెట్:** గౌతంనగర్ డివిజన్ జేఎస్ఎల్ఎన్‌నగర్‌లోని శ్రీ జయగిరి లక్ష్మీనరసింహస్వామి ఈలయంలో జరుగుతున్న జయంత్యోత్సవాలకు స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకన్న, రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్‌కు ఘన నివాళి


**ఘట్‌కేసర్, మే 11:** సమాజ సంరక్షణలో భాగంగా విధినిర్వహణలో మృతి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ అమరుడని పలువురు నాయకులు కొనియాడారు. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి మృతి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన వాడిగా సమాజ శ్రేయస్సు కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన సందీప్ త్యాగం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసు, నాయకులు సుదర్శన్ రెడ్డి, బాల్ రాజు, రాములు, రాజేష్ కుమార్, నర్సింగ్ రావు, గంగారాం, ఆంజనేయులు, గణేష్ గౌడ్, జగదీష్, సురేష్ గౌడ్, జహీరుద్దీన్, రామేశ్వర్ రావు, కృష్ణంరాజు, వెంకటేశ్వర్లు, నిఖిల్, కృష్ణ, లలిత్ తదితరులు పాల్గొన్నారు.





ఘట్‌కేసర్ పట్టణంలో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

## మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి చిరస్మరణీయుడు



అల్వాల్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**మల్కాజిగిరి, మే 11:** మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి చిరస్మరణీయుడని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

ఆదివారం అల్వాల్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ప్రమీల, కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి గౌడ్, చంద్రశేఖర్, శరన్‌గిరి, ప్రేమ్ కుమార్, శోభన్ బాబు, సాజిద్, సతీశ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తి తో యువత ముందుకు సాగాలి

**శామీర్ పేట్, మే 11 :** క్రీడా స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని అలియాబాద్ మాజీ సర్పంచ్, టోర్నమెంట్ నిర్వాహకుడు కంటం కృష్ణారెడ్డి అన్నారు. అలియాబాద్ సాయిరాం టీమ్ సభ్యులైన ధర్మేందర్, రమేష్, శ్రీరాములు జ్ఞాపకార్థం నిర్వహించిన శ్రీ సాయిరామ్ యూత్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. టోర్నీ విజేతలుగా గుడ్ విల్స్ టీమ్ నిలువగా రూ. 5000 శ్రీహరి, రన్నరగా నిలిచిన వాలీబాల్ టీమ్‌కు రూ. 2500 లను సుదీర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగమల్లారెడ్డి, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



జైలు అధికారులతో మాట్లాడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**చర్లపల్లి, మే 11:**చర్లపల్లి డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణానగర్, ఎంఆర్ఆర్ కాలనీల్లో నుంచి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను ఆదివారం జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రాకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వివరించడంతో వెంటనే ఆమె డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రాకు వివరించడంతో ఆమె సానుకూలంగా స్పదించిందని, వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా డ్రైనేజీ సమస్యను హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా దృష్టికి తీసుకువె ళ్లామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్‌గౌడ్, గిరిబాబు, నర్సింహ, ఆనంద్‌రాజుగౌడ్, పరుశురాం పాల్గొన్నారు.

## వీరజవాన్ల విజయాన్ని కాంక్షిస్తూ సుదర్శన హోమం



ఏఎస్‌రావునగర్ డివిజన్ ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లో 'సుదర్శన హోమం' నిర్వహిస్తున్న దృశ్యం

**కాప్రా:** భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో పోరాడుతున్న వీర జవానుల క్షేమాన్ని, యుద్ధంలో ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ ఆదివారం ఏఎస్‌రావు నగర్ డివిజన్ కనకధారా ల్యాండ్ మార్క్ అపార్ట్మెంట్ వాసులు 'గణపతి హోమం','సుదర్శన హోమం', 'మృత్యుంజయ హోమం' నిర్వహించారు. బ్రహ్మశ్రీ అదరాసుపల్లి భరత్ కుమార్ శర్మ, తీగుళ్ల సాకేత్ రామశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమానికి అపార్ట్‌మెంట్ వాసులతోపాటు పరిసర కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దేశభక్తిని చాటుకున్నారు. సైనికులు క్షేమంగా ఉండాలని, శత్రువులపై ఘన విజయం సాధించాలని కోరుతూ కాలనీ వాసులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యుద్ధంలో మన సైనికులు ఇంతవరకు సాధించిన విజయాలను గూరించి మహాభాగ్యనగర్ బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపకులు ఏ.శ్యామ్ మోహన శర్మ, అపార్ట్‌మెంట్ వాసి నాగేశ్వరరావు వివరించారు.